మంచుదెబ్బ

పశ్చిమదిక్కున విచ్చలవిడిగా చెలరేగుతున్న శారదనీరదపంక్తుల్ని చూస్తూ డాబామీద నిల్చున్నాను. ఇవేనేమో వప్రక్రీడాగజప్రేక్షణీయంగా కనిపించినవి. నల్లగా బండరాళ్ళలా కారు ఎనుముల్లా ఉన్న ఆ మేఘాలు అస్తమిస్తున్న సూర్యుడిని దాచ ప్రయత్నిస్తున్నాయి. సూర్యనారాయణుడు అల్లరిపిల్లవాడిలా ఆడుగునుంచే చేతులు చాపుతున్నాడు. దివ్యకాంతులు విరజిమ్మే ఘనశ్యామసుందరుడు ఇలాగే ప్రకాశించేడు కాబోలు. అంత ఎత్తుకు ఎగరలేని రాధ కిందనించి దిగులుగా "నీలీలలకి అమాయమనైన నేనే దొరికేనా?" అన్నట్టు చూస్తుంది కాబోలు ...

నాకూ ఆ మేఘమాలకీ మధ్య వచ్చి నిలచిన రాధ - ఎదురుగా డాబామీద - మెల్లిగా కదిలి నేపథ్యంలోకి మాయమైంది. ఆ నడక తీరు జంకొదవెడి కాళ్ళతోడ మెల్లిగా మెట్లు దిగుతున్న రాచపిల్ల పోలికనుంది.

నాకు తెలిసినంతమటుకు ఆ యింట్లో ఒకే వృద్ధవనిత ఉంది. ఆయింటికి ఆమే యజమానురాలు. ఆ యిల్లు మాయిల్లు నానుకుని వెనక వేపుంది. మూడు తరాలకి ముందు ఆయింటికీ ఈయింటికీ ఒక్కడే యజమాని అనడానికి సాక్ష్యం రెండు డాబాల్నీ వేరు చేస్తూ నిలచిన మూడడుగుల పిట్టగోడ. రాజమార్గాన సింహద్వారం చేరాలంటే ఓ వందగజాలు నడిచి రెండు మలుపులు తిరగాలి.

రాత్రి భోజనాలదగ్గర అమ్మతో అన్నాను ఆ వెనకయింట్లోకి ఎవరో వచ్చినట్టున్నారే అని.

"ఆ ముసలావిడకి మనవడో ఏదో అవుతాట్ట. మొన్న పదో తారీకున పెళ్లయిందిట. పిల్ల కుందనపుబొమ్మలా ఉంది. ఆ కళ్ళు ఇలా తిప్పిందంటే ఈ చివరకొస్తూ. ఏం లాభం? ఏదో జబ్బుట. మాటాడదు. అన్నం తినదు. గజ్జలగుర్రంలో దాట్లేసే పిల్ల జీవచ్ఛవంలా తయారయిందని ఆవిడ గోలెత్తుతోంది." ఔచితికి తగిన అంగన్యాసకరన్యాసాలతో అమ్మ వివరిస్తుంటే ఇంత భోగట్టా ఎలా సేకరించిందన్న

ఆశ్చర్యం కన్నా పెళ్ళయి వారంరోజులయినా పెదిమ కదపని ఆ ముద్దరాలి ప్రవర్తన ఎక్కువ ఆశ్చర్యపరచింది నన్ను.

"మగపిల్లేమో," అన్నాను.

"సరేలే."

తలెత్తి అమ్మవేపు చూశాను ఎందుకు కాకూడదూ అన్నట్టు.

"పెళ్ళిచూపులనాడు అష్టపది పాడిందిట. ఆపాటకే మురిసిపోయి చేసుకున్నారుట,"

"ఏం పాట బాబూ అదీ?" అన్నాను నవ్వుతూ.

"ధీరసమీరే."

తృళ్ళిపడ్డాను ఆపాట అంత మనోరంజకంగా పాడగల మనిషిని నాకు తెలుసు. నేను గుంటూరులో థర్డుఫారం చదువుతున్న రోజుల్లో నాతోపాటు స్కూలికి వచ్చే వకుళ. తన పాట విని పెళ్ళి చేసుకోడం ఓ ఉద్ధరింపు కాదు. తన పాటకి పాములే ఆడతాయి. స్కూల్లో ఖడ్గ తిక్కన నాటకంలో వకుళ వార్తాహరుడుగా ఒక నిముషంపాటు స్టేజిమీద కనిపించి తన కంఠమాధురితో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వకుళ. తిక్కన మరణించేడని చెప్పడానికి వచ్చి చానమ్మ వీరపత్నిగా ఆచంద్రతారార్కం కీర్తింపబడుతుందని చెప్పే ఘట్టం. వకుళ పద్యం చదువుతుంటే స్థాణువులయిపోయిన ప్రేక్షకులు వన్స్ మోర్ అంటు కేకలేస్తే చానమ్మకి అయ్యో అని వాపోడానికి అవకాశమే దొరకలేదు. నేను సాయంత్రం డాబామీద చూసింది ఆ వకుళనన్నమాట.

మాఊళ్ళో శలవులకి తోచదని ఇక్కడికొచ్చి ఇక్కడ కాలక్షేపంకోసం కొట్టుకుపోతున్న నాకు నచ్చిన స్నేహితురాలు దొరికిందని సంతోషించేను. కానీ అంతలోనే జ్ఞాపకం వచ్చింది - మతే పోయిందో, మనసే పోయిందో, రోగమో, నొప్పో ఏదీ తెలీదు. కన్న తల్లిదండ్రులతోనూ కట్టుకున్న భర్తతోనూ మాటాడని వకుళ

నాతోమటుకు మాటాడుతుందా? వాళ్ళకంటే నేను ఎక్కువా? అందులోనూ మా చుట్టరికం ఏనాటి మాట!!

ఆఖరికి అమ్మమీద విసుక్కున్నాను, “మాటాడ్డనికి కాదు సరికదా దెబ్బలాడ్డానికేనా ఎవరూ లేని అడవి. నేను రానంటుంటే తీసుకొచ్చేవిక్కడికి,” అని.

వకుళ పగలల్లా ఎక్కడా కనిపించలేదు. కానీ సాయంత్రం సరిగ్గా నిన్నటివేళకి డాబామీదకి వచ్చింది. ఆకాశం ముసురేసి ఉంది.

చినుకు పడితే తగలబడిపోతుందని డాబామీద ఎండబెట్టిన ఆవకాయ ఎత్తిపెట్టడానికి వచ్చింది అమ్మ. నేనూ సాయం చెయ్యడానికి అటు వెళ్ళేను.

వకుళని పిలుద్దాం అనుకుంటుంటే ఒకతను వచ్చేడు వాళ్ళడాబామీదికి. పొట్టిగా నల్లగా ఉన్నాడు. “అమ్మా వాళ్ళూ ఎవరూ లేరు. నేనలా బయటికెళ్తున్నాను,” అన్నాడు వకుళతో.

వకుళ అలవోకగా అతనివేపు చూసి మొహం తిప్పుకుంది.

“ఏం?” అన్నాడతను మళ్ళీ.

వకుళ ఈమారు ఆ మాత్రం చూడను కూడా లేదు.

“ఛీ ఏం మనిషి. అత్తకి చూపుచేటూ కోడలికి మోపుచేటూ,” అతను గొణుక్కుంటూ వెళ్ళిపోయేడు.

సరసుడే అనుకున్నాను.

వకుళకీ నాకూ చిత్రమైన స్నేహం ఉండేది. మేమిద్దరం కలిసి ఆడుకున్నవాళ్ళం కాదు. ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్నవాళ్ళమూ కాదు. కాని వకుళ దేనికైనా బాధ పడితే నాదగ్గరకొచ్చి కూచునేది. మాయిద్దరిమధ్యా మాటలూ, సమస్యలూ, సమాధానాలూ లేకపోయినా మాకేమీ వెలితి ఉండేది కాదు. ఎదటి మనిషి కాల్లొ ముల్లు విరిగితే తన గుండెల్లో గునపాలు గుచ్చుకున్నట్టు విలవిల్లాడే వకుళ “ఛీ” అనిపించుకుంటూ బతుకు సాగించుకుంటోందంటే ఏదో జరిగి ఉండాలి. కానీ అది ఏమిటి? కడుపులో బాధ కన్నతల్లికే చెప్పుకోని వకుళ నాక చెప్తుందన్న భ్రమ నాకు

లేదు. కానీ ఒకటో రెండో కథలు కల్పించి రాసిన నాకు వకుళ మౌనకారణం మాత్రం క్లూ దొరకని పజిల్లా ఉండిపోయింది. ఆ రాత్రంతా ఆలోచించినా తెగలేదు.

మర్నాడు పొద్దున్న అమ్మ మళ్ళీ డాబామీదికి రావడంతో నేనూ స్నానం చేసి వచ్చేను. వకుళ బట్టలారేస్తోంది వాళ్ళడాబామీద. తెగించి పిలిచేను. వకుళ ఉలిక్కిపడి నావేపు చూసి వెళ్ళిపోయింది.

"ఏం? నువ్వు దిగి వచ్చేననుకుంటున్నావేమిటి?" అంది అమ్మ వకుళ నాకు సమాధానం చెప్పలేదని.

"ఏం జబ్బో?" అన్నాను సాలోచనగా.

"జబ్బేమిటి తెగులు," అంది అమ్మ.

నేను తెల్లబోయేను.

నిన్న గాక మొన్న తనస్థితికి జాలిపడిన అమ్మ ఇవాళ ఇంత కఠినంగా మాటాడ్డానికి వకుళ చేసిన నేరం ఏమిటో?

అమ్మదగ్గర్నుంచి రాబట్టగలిగిన కథ ఇదీ - ముందురోజు సాయంత్రం వకుళ అత్తగారు ఓ పొరుగుపెలుగుతో పచ్చీసు ఆడుతుండగా, ఆమెభర్త నరహరి వీధిలోకి వెళ్ళిపోయేడు వకుళతో చెప్పి. అది నిజం అనడానికి నేనే సాక్ష్యం. అలా అతను ఆ చల్లని సాయంవేళ షికారుకెళ్ళిన సందర్భం ఆసరా చేసుకుని దారిన పోతున్న ఒక సీజరు సీవిట్లో ఉన్న రేడియో, ఆపక్కనే కుర్చీమీద నీటుగా ఇస్త్రీ చేసి పెట్టిన పట్టుచీరా పట్టుకుపోయేడు.

మండువాలో మంచంమీద కూర్చుని ఉన్న వకుళ అతను ఇంటిలో ప్రవేశించిన క్షణంనించీ చూస్తూనే ఉందిట పరమానందయ్య శిష్యులకైనా సిగ్గు తెప్పించగల నిశ్చలతతో.

"చిత్రంగానే ఉంది," అన్నాను నవ్వుతూ.

"నీకు నవ్వుగా ఉందేం? నూటయాభై రూపాయల ఆరణి చీరె," అంది అమ్మ ఆచీరె తనదే అయినట్టు.

చీరె స్వంతదారే చీర పోతున్న దారి చూస్తూ ఊరుకుంటే నాకెందుకు నొప్పి? పడేవాళ్ళు పడితే నవ్వగలిగినవాళ్ళు నవ్వరాదంటుంది అమ్మ. ఆ పరిస్థితుల్లో ఆ చీరే నాదే అయినా నవ్వి ఉండేదాన్ని.

“కాఫీరంగు ఆరెంజి అంచు ... ఎలా అంటే అలా ఉండేదిట,” అంది అమ్మే మళ్ళీ.

గతుక్కుమన్నాను.

“పెళ్ళిచీరెలన్నీ కొనడం అయిపోయినతరవాత వకుళ ఆ చీరె చూసి పట్టు బట్టి కొనిపించిందిట.”

ఆడవాళ్ళకి చీరెలమీద ఉండే మోజు కట్టుకున్న మొగాడిమీద ఉండకపోవడంవల్లే సంసారాల్లో కలతలు వస్తాయని ఒక ప్రాజ్ఞుడి అభిప్రాయం. వకుళ కోరి కొనిపించుకున్న పట్టుచీర చేజేతులా పారేసుకుందంటే ఈమారు నాకు నవ్వు రాలేదు. తనకి ఆరెంజి రంగు అంచుమీదున్న ప్రేమ నాకు తెలియనిది కాదు.

రోజు సాయంత్రం అదేవేళకి వాళ్ళడాబామీద తనూ మా డాబామీద నేనూ చేరేవాళ్ళం. మూడు రోజులు పోయేక కాబోలు నావేపు చూసింది. ఆ చూపులో గుర్తించేనన్నట్టు అనిపిస్తే నేను చిన్న చిరునవ్వు నవ్వేను. వకుళ గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయింది.

నేను కిందకొచ్చి మంచం వాల్చుకుని పడుకున్నాను. ... చిన్న కునుకు తీశాను కాబోలు కళ్ళు తెరిచేవేళకి గదిలో ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి. గొంతు పరిచయమైయనట్టే ఉంది. ఆవిడ వకుళ వాళ్లమ్మ.

నన్ను చూడగానే, “కల్యాణి కదూ! ఎంత పెద్దదానివయేవూ,” అంది.

చీరసంగతి తెలిసి ఆవిడ వచ్చిందిట. ఆవిడకీ అర్థం కావడంలేదు వకుళధోరణి.

రోజుకొక డాక్టరుకి చూపిస్తున్నారు. ఎక్స్‌రేలు తీయిస్తున్నారు. స్పెషలిస్టులని కలుసుకున్నారు. అసలు పేషంటే తన బాధేమిటో చెప్పకపోతే డాక్టరేం చేస్తాడు? దేవుడే “నీకేం కావాల”ని అడిగి కానీ వరం ఇవ్వలేడు.

పిచ్చాసుపత్రికి తీసుకెళ్లేరు ఇదేదైనా పిచ్చి సంబంధమేమోనని. రెండు రోజులు అక్కడ ఉంచమన్నారుట. సరేనని నరహరి స్పెషల్ వార్డులో ఒకగది తీసుకుని అక్కడ ఉంచేడు. వకుళ మాటడలేదు. మాటాడకపోవడంతప్ప ఆమెలో మరే లోపమూ లేదు. అన్ని రకాల టెస్టులూ అయేక, “ఆ పిల్లకేం పిచ్చి? అలా అన్నవాళ్ళకి పిచ్చి. ఆ అమ్మాయి జబ్బు మనోవ్యాధి. ఆ పిల్లకేం కావాలో కనుక్కోండి,” అన్నాడు ఆ పిచ్చిడాక్టరు.

“మీకు పిచ్చిలా ఉంది. దానికి నిజంగా ఒట్టి మనోవ్యాధే అయితే మేం తీసుకెళ్ళిన డాక్టర్లందరిదగ్గరికీ ఎందుకు వస్తుందీ?” అంది వకుళతల్లి వరలక్ష్మమ్మ.

డాక్టరు నవ్వి, “నేను రాసిస్తానమ్మా ఆ అమ్మాయికే విధమైన జబ్బూ లేదని. మీరు ఇంగ్లండు తీసికెళ్ళినా అంతే. బహుశా ఈ పెళ్ళి ఇష్టం లేదేమో,” అన్నాడు.

వరలక్ష్మమ్మగారు పిల్లని తీసుకొచ్చేశారు.

పెళ్ళి నిశ్చయం అయినప్పుడు వకుళ బొత్తిగా డాన్సు చెయ్యలేదు కానీ మరెలాటి కళలూ చూపలేదు ఇష్టం లేదనుకోడానికి. పల్లెపట్టున నాయనమ్మహయాంలో పెరిగినందున ప్రేమా గీమా అంటూ చెలరేగే అవకాశం లేదు. అట్టిసంగతి వకుళ ఎరగనిది. పైగా ఈ మూగనోము పట్టింది పెళ్ళయిన నాలుగోరోజున!

ఇంట్లో వంటపని ముసలావిడ చూసుకున్నా పైపనంతా చూసుకునేది వకుళే. చేసినపని చేతగానట్టు గానీ అయిష్టంగా చేసినట్టు గానీ ఉండేది కాదు. ఆఖరికి నరహరి “నీకేం కావాలో చెప్పు, నేను సాధించుకొస్తాను,” అన్నాడుట. ఆపదమొక్కులవాడికి మొక్కుకున్నారు నిలువుదోపిడీ ఇస్తామని. నరహరి సైకాలజిస్టుదగ్గరికి తీసుకెళ్ళేడు. ఆయన సవాలక్ష ప్రశ్నలు వేశారు - ఆ అమ్మాయి పెరిగిన వాతావరణం ఎలాటిది? తల్లిదండ్రులు ఎలాటివారు? అమ్మాయి అభిరుచులేమిటి?

నరహరి తనకి తోచిన సమాధానాలు చెప్పేడు. అవేమంత సంతృప్తికరంగా లేవు. రోజు సూర్యాస్తమానం చూస్తూంటుందని చెప్పేడట. తనని ఆ సమయంలో చూస్తానన్నాడట ఆ సైకాలజిస్టు.

అవేళ సాయంకాలం పిట్టగోడకి ఇటు నేనూ అటు వకుళా నిలుచుని ఉండగా వచ్చేరాయన. నేను బాగుండదేమోనని వెనుదిరగబోయేను. వకుళ చప్పున నా చేయి పుచ్చుకుని ఆపింది. తనభావం గ్రహించుకుని నేను నిలబడిపోయేను అక్కడే. ఆ డాక్టరుగారు వేసే వెయ్యిన్నొక్క ప్రశ్నలకి జవాబు చెప్పలేకో, చెప్పే ఆలోచన లేకో, లేదా తనకి మిగిలిన ఆ ఒక్క ఘడియ ఆనందాన్ని తనకి కాకుండా చేయ నుంకించిన ఆ మానవుణ్ణి పొమ్మని చెప్పమనో ...

"ఇవాళ ఆకాశం బాగులేదు," అన్నారాయన.

వకుళ ఒక్క క్షణం ఆయనవేపు చూసి డాబా పిట్టగోడ దూకి మాఇంట్లోకి వచ్చేసింది! మరుక్షణంలో ఆక్కడ ఎదురెదురుగా నిలబడింది నేనూ, వకుళ మనోభావాల్ని కనిపెట్టడానికొచ్చిన సైకాలజిస్టూను!

"ఆ అమ్మాయిని మీకెంతకాలంనుంచీ తెలుసు?" అని ప్రశ్నించేరాయన నన్నుద్దేశించి.

"నాకెంతకాలంనుండీ తెలీదు. నేను ఫోర్తుఫారం చదివేరోజుల్లో తను థర్డుఫారం చదువుతూండేది," అన్నాను.

వకుళగురించి నాకు తెలిసింది చెప్పమని అడిగేరు. వెనక్కి తిరిగి చూసేను. వకుళ నాగదిలో మంచంమీద వెల్లకిలా పడుకుని రెండు చేతులతో కళ్ళు మూసుకుంది.

"మీరు సైకాలజిస్టు కనక, అడిగేరు కనక నాకు తెలిసింది చెబుతున్నాను. ఇది కేవలం నా ఊహ కావచ్చు కూడా. నాకు తెలిసినంతవరకూ వకుళ పువ్వులాటి మనిషి. పసిపాపవంటి అమాయకురాలు. పుస్తకాల్లో ఎత్తి చూపే మోసమూ, దగా, స్పర్థలూ, అసూయలూ పుస్తకాల్లోనే తప్ప నిజంగా ఉండవని నమ్మిన ముగ్ధ. తనని చూస్తే నాకు ఎప్పుడో ఎక్కడో చదివిన వాక్యాలు గుర్తొస్తాయి. బహుశా మీరూ చదివే ఉండొచ్చు. ఒక ఆడదానికి మతి భ్రమించిందంటే ఒక మహా కవయిత్రి మనకి దక్కకుండా పోయినట్టు అని. ఒక అడవిమనిషి మూలికలు ఏరుకుంటూ

తిరుగుతోందంటే ఒక ధీశాలిని మేధస్సు వృధా అయిపోయినట్టని. వకుళని చూస్తుంటే నాకదే జ్ఞాపకం వస్తుంది,'' అన్నాను.

“అది నిజమే కావచ్చు. కానీ ఆ అమ్మాయిలో మార్పు తెచ్చిన సంఘటన ఏమిటో కనుక్కోండి ప్రయత్నించి. ఒక మనిషి షాక్ తినడం ఎంత సహజమో దానినుండి తేరుకోడం కూడా అంతే సహజం. కారణం తెలిస్తే మనం దానికి ప్రతి ఆలోచించివచ్చు.''

ఆయన వెళ్ళిపోయినా నాకు వకుళదగ్గరికి వెళ్ళే సాహసం లేకపోయింది. తనకి ఇష్టమయిన ఆ సాయంశోభని తిలకిస్తూ నిలబడిన నాకు తను వచ్చి నావెనకే నిలబడినట్టు తెలియనేలేదు. తనమొహం చూసి దొంగతనం చేసినట్టు ఫీలయేను. వాళ్ళమ్మని చూస్తే జాలేసింది నాకు. “అర్ధాయుష్కుడయిన కొడుకా, ఐదవతనం లేని కూతురా?'' అన్నట్టు నలభయ్యోపడిలో పడ్డాక కలిగిన ఒక్కగానొక్క కూతురిబతుకూ ఇలా తెల్లార్తూంది. నిజంగా వకుళకి ఈ కాపురం ఇష్టం లేకపోతే తమఊరు తీసుకపోడానికి సిద్ధం అవుతోంది ఆవిడ. తల్లిప్రాణం!

వకుళ ఎంతో విశ్వాసంతో నాపక్కన నిలబడడం గుర్తొచ్చింది. ఎలా ప్రశ్నించను నీ మిస్టరీ ఏమిటని? అది పైవాళ్ళకి ఎలా చెప్పను? చరిత్రలో విభీషణుడిదగ్గర్నుంచీ దేశదేశాలా మున్నూరు కాలాలా ప్రసిద్ధికెక్కిన పేర్లన్నీ కళ్ళముందు మెదిలేయి. నా ద్రోహానికి శిక్ష ఉండదు. కానీ వకుళ మామూలు మనిషయితే ఎంతమందికి పరమానందం కాదు? నాకు మటుకు అది సమ్మతం కాదూ?

000

మర్నాడు పొద్దున్న కాఫీ తాగి, “నేను వాళ్ళింటికి వెళ్తున్నా,'' అన్నాను అమ్మతో.

“వెళ్ళఖ్ఖర్లేదు,'' అంది అమ్మ. తరవాత తెలిసింది దెయ్యం పట్టిందేమో అన్నారట ఎవరో.

భూతవైద్యుణ్ణి పిలిపించేరు. వాడు వకుళని నఖశిఖపర్యంతం నాలుగుమార్లు చూశాడు. చుట్టూ ప్రదక్షిణం చేసేడు. "మూగదయ్యం," అన్నాడు. ఐదువందల రూపాయాలు కుప్ప పోయించేడు. దానిమీద చక్కరం గీసేడు. నాలుగు కూతలు కూసేడు. "పలుకు," అన్నాడు. వకుళ పలకలేదు. వేపమండలతో బాదేడు. పసుపూ, కుంకుమా, బూడిదా ఇల్లల్లా జల్లేడు. "అమ్మా అను" అన్నాడు. వకుళ అనలేదు. వాడు వెళ్ళిపోయేక వకుళచేతిమీద మణికట్టునుండీ మధ్యవేలివరకూ జెర్రిపోతులాంటి ఎర్రని గీత కనిపించడంతో ఎవరికీ నోట మాట రాలేదు. నిజంగా ఆ పిల్లకి ఏం జబ్బుందో, దానివల్ల ఏం బాధ అనుభవిస్తోందో తెలీదు కానీ ట్రీట్మెంటు పేరున ఆపిల్లని వీళ్ళు నానా హింసా పెడుతున్నారు.

"ఎందుకొచ్చిన మందులండీ ఇవన్నీ. అసుల జబ్బుకన్నా వీటిబాధే ఎక్కువగా ఉన్నట్టుంది. కొన్నాళ్ళపాటు ఊరుకోండి. అవే సర్దుకుంటాయి," అన్నాను.

"మేమూ అదే అనుకుంటున్నాం. పైగా నిన్న అతడు కూడా మాయ చేసి పశువుని అంటగట్టేవని విసుర్లు విసిరేడు. మాణిక్యంలాటి పిల్ల ఇలా అయిపోయిందని మేం ఏడుస్తుంటే ఈ పోటుమాటలు. ఏదయితే అదే అవుతుంది. దాన్ని తీసుకుపోతాం. బాగుంటేనే పంపిస్తాం," అందావిడ.

వకుళ పరిసరాల్లో జరుగుతున్నవేవీ పట్టించుకోకపోతే, గ్రహించుకోకపోతే తనంత అదృష్టవంతురాలు మరొకరు ఉండరు అనిపించింది నాకు.

ఆసాయంత్రం వకుళని చూడ్డానికి వెళ్ళేను మర్నాడు ఉదయం వెళ్ళిపోతుందని. నేను ఇంట్లో ప్రవేశించగానే నావెనకే సరహరి వచ్చేడు.

"మీరు తీసికెళ్ళి ఆ పల్లెటూళ్లో ఏం చేస్తారు? నాతోనే పంపించండి. నాస్నేహితుడొకడున్నాడు స్పెషలిస్టు. చూపిస్తాను," అన్నాడు.

నోరూ వాయీ లేని లేగదూడవంటి అమాయకురాలిని తొమ్మిదివందలదూరం తోలమంటున్నాడు. వరలక్ష్మమ్మగారు విచిత్రంగా చూసేరు అతడివైపు.

"అవును. నాతోనే తీసుకెళ్ళి నేనే ట్రీట్మెంటిప్పిస్తాను."

అంతవరకూ అక్కడ తనని కాదన్నట్టు నిర్వికారంగా కూచుని ఉన్న వకుళ భర్తవేపు దృక్కులు సారించింది. అది తపోనిష్ఠుడయిన ఫాలాక్షుడు మూడోకన్ను విప్పి మన్మధుడిని చూసిన చూపు. యుగయుగాలగా మగవాడి అన్యాయానికి వినయంతో తలవంచిన స్త్రీత్వం మేలుకొని చూసిన చూపు. గగనంలో విహరిస్తున్న గరుత్మంతుని శివుని కంఠహారమైన కోడెత్రాచు చూసే చూపు. అ చూపులో శ్లేష లేదు.

నరహరి తల వంచుకుని వెళ్ళిపోయేడు.

ఆ రాత్రి గాలి లేదని డాబామీద మంచం వేసుకుని పడుకున్నాను. వకుళగూర్చిన ఆలోచనలు నిద్ర పోనీయలేదు. వకుళకి ఈ పెళ్ళి ఇష్టం లేదనడంలో సందేహం లేదు. యుగధర్మానికి ఎదురు చెబుతున్నట్టనిపించింది. అతడు నవ మన్మధుడు కాకపోవచ్చు. తల్లిదండ్రులు మెడలు విరిచి చేసింది మాత్రం కాదు. తను మొదటే ఎందుకు చెప్పలేదు? ....

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలివొచ్చేసరికి గదిలో గడియారం రెండు కొట్టింది. మంచంమీద ఎవరో ఉన్నట్టనిపించి కళ్ళు తెరిచేను.

వకుళ!

నేను లేచి కూచున్నాను. పున్నమి చంద్రుడు పిల్లజమీందారులా వెన్నెలలు వెదజల్లుతున్నాడు. వెన్నెట్లో తన కళ్ళు నీటిలో చేపల్లా మెరుస్తున్నాయి.

నాకు ఏదో మాటాడాలనుంది. తనకి ధైర్యం చెప్పాలనుంది. కానా ఆ స్తబ్ధనిశీధిలో - జడభరతునిలా వకుళ - ప్రకృతిలో ఓ భాగంగా కనిపించింది. నేను తనకి ఏం చెప్పగలను? దేవతలకి పంచాంగం చెప్పగలదానిని కాను నేను.

"కల్యాణీ"

"వకుళా!"

వకుళ మాటాడుతోంది! వంద ప్రశ్నలు నాలో చెలరేగేయి. ఏది ముందు? ఏది వెనక? ...

వకుళ నిశ్శబ్దంగా నాచేతిని తనచేతిలోకి తీసుకుంది.

“కల్యాణీ, అతను తృతీయాప్రకృతివాడు.”

నిస్సహాయంగా వకుళ ఆడినమాట నాకు వికృతంగా ధ్వనించింది ఆ చీకట్లో.

తను ఇంక చెప్పవలసింది ఏమీ లేదు. తననిగురించిన మిస్టరీ ఏమీ లేదు.

మంచుదెబ్బ తిన్న తమ్మిపువ్వు, నలిపి పారేసిన గులాబీపువ్వు మళ్ళీ మొహం ఎత్తదు.

వకుళ వెళ్ళిపోవడం నాకు తెలీదు. మళ్ళీ నాకు తెలివొచ్చేసరికి రేడియోలో ఇంగ్లీషులో వార్తలు వస్తున్నాయి. భరణిపుల్ల తీసుకుని పెరట్లోకి వెళ్తున్న నన్ను చూసి అమ్మ “వకుళ” అంది.

“అవును,” అనబోయి, అమ్మమొహం చూసి ఆగిపోయేను.

వకుళ చచ్చిపోయింది.

అరుగుమీద శవంచుట్టూ చేరి అందరూ ఏడుస్తున్నారు. నాకు తెలీకుండానే ఒక నిట్టూర్పు వెలువడింది.

వకుళ సుఖపడింది.

వరలక్ష్మమ్మగారు తల్చుకు తల్చుకు కుమిలిపోతున్నారు. వాళ్ళ నాయనమ్మ ముందుగా చెప్పి పోయిందిట. అలాగే ఈపిల్లకి కూడా తనచావుగురించి ముందే తెలుసేమోనని ఆవిడబాధ.

రాత్రి హఠాత్తుగా కడుపునొప్పి వచ్చి చుట్టుకుపోవడం మొదలుపెట్టిందిట. ఆస్పత్రికి తీసుకెళ్తుంటే సగం దారిలోనే ప్రాణం పోయిందిట.

చూడలేక వెనుదిరిగేను.

నరహరి గేటుదగ్గర నిలబడి కల్లబొల్లి ఏడుపులు ఏడుస్తున్నాడు. లాగి చెంప పెట్టు పెడదామనిపించింది.

000

వకుళజీవితం అలా ముగిసింది. కానీ నరహరి ఎందుకు పెళ్ళి చేసుకున్నాడు? అంత డబ్బు ఎందుకు ఖర్చు పెట్టేడు? అని నన్నడక్కండి. వట్టి పుణ్యానికి అబద్ధాలు

చెప్పేవాళ్ళూ, వృథాన్యార్థభంగము గావించడువారూ, రెండు రూపాయలు ధర్మం చేసి మూడు తరాలపేర్లు చెక్కించుకునేవాళ్లూ - వాళ్ళెవరైనా చెప్పగలరేమో సమాధానం.

000

(1964-65 ప్రాంతాల్లో తొలిసారిగా ‘‘రచన’’ మాసపత్రికలో ప్రచురితం. తరవాత 1969లో ‘‘ప్రగతి’’ వారపత్రికలో పునర్ముద్రితం.)